కుక్కల దాడిలో మహిళకు గాయాలు

రుద్రూర్, ఫిబ్రవరి 19: రుద్రూర్ మండల కేంద్రంలో డబల్‌బెడ్‌రూం ప్రాంతంలో బుధవారం కుక్కల దాడిలో ఓ మహిళకు గాయాలయ్యాయి. జేఎన్‌సీ కాలనీలో ఓ ప్రైవేటు స్కూల్ టీచర్ నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. స్థానికులు గమనించి వాటిని తరిమివేశారు. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. ఇప్పటి వరకు సుమారు ఐదుగురిపై కుక్కలు దాడి చేశాయని స్థానికులు తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఇసుక డంపులు సీజ్

ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారిణి

రుద్రూర్, ఫిబ్రవరి 19: మండలంలోని సులేమాన్‌నగర్ షాదీఖాన వద్ద ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. మండలంలో రాత్రి వేళలో అక్రమంగా ఇసుక డంప్ చేయడంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా డంప్ చేసినట్లు తెలిస్తే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సులేమాన్‌నగర్‌లో ఆరు ట్రాక్టర్ల ఇసుక సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

మైనార్టీ గురుకులాల్లో మెరుగైన విద్య

ఉపాధ్యాయులతో విద్యార్థులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 19: కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ మైనార్టీ గురుకులాల్లో మెరుగైన విద్యను అందిస్తున్నామని డిచ్‌పల్లిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ సయ్యద్ అర్షి ఇక్బాల్ అన్నారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటుచేసిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఇంటర్ విద్యార్థులు తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో సరదాగా గడిపారు. అధ్యాపకులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో

రుద్రూర్, ఫిబ్రవరి 19: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వర్ని ఎంపీవో మారుతి అన్నారు. సిద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేశారు.

విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించాలి

- నగరంలోని పాఠశాలల్లో మొదట ప్రారంభించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పాల్గొన్న అధికారులు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 19: పాఠశాలల్లోని విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్‌ను అప్‌డేట్ చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. హైదరాబాద్ నుంచి వీసీ ద్వారా డిప్యూటీ డైరెక్టర్ చైతన్యారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఐదేండ్లలోపు వయస్సు ఉన్న చిన్నారులు 61,412 మంది, పదిహేను ఏండ్ల వయస్సు వారు 40,275 మంది ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ పెండింగ్‌లో ఉన్నదని డీడీ చైతన్యారెడ్డి తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ స్పందిస్తూ జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్‌కు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి అశోక్‌ను ఆదేశించారు. నగరంలోని పాఠశాలల్లో ఈ ప్రక్రియను వెంటనే చేపట్టాలని, నెల రోజుల వ్యవధిలో విద్యార్థులందరి బయోమెట్రిక్ అప్‌డేట్ చేసేలా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేండ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసేలా జిల్లా యంత్రాంగం చొరవ చూపాలని డిప్యూటీ డైరెక్టర్ చైతన్యారెడ్డి కలెక్టర్‌కు సూచించారు. ఆధార్ సేవల్లో సాంకేతిక సమస్యలు ఇతర ఇబ్బందులను పరిష్కరించేందుకు జిల్లాలో మెగా క్యాంప్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఈడీఎం కార్తీక్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, లీడ్ బ్యాంకు మేనేజర్ అశోక్‌చౌహాన్, డీడబ్ల్యూవో రసూల్ బీ, డీఎస్సీడీవో నిర్మల, పోస్టల్ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గుంతలు తీశారు.. వదిలేశారు

కంఠేశ్వర్ ప్రాంతంలో ప్రమాదకరంగా ప్రయాణం

కంఠేశ్వర్ ప్రాంతంలో రోడ్డుపై గుంతలు తీసి, అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 19: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ నుంచి నగరంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా తయారైంది. కొద్ది రోజుల నుంచి అధికారులు ఏదో ఒక కారణంతో ప్రధాన దారిపై తవ్వకాలు చేపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే దారి, కొద్దిపాటి బారికేడ్లు ఏర్పాటు చేసినా కానీ దగ్గరగా వచ్చేవరకు గుంతలు సరిగ్గా కనబడక పోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కంఠేశ్వర్ చౌరస్తా ప్రాంతంలో గుంత తవ్వి నామమాత్రంగా పూడ్చివేయడంతో అందులో ఆర్టీసీ బస్సు దిగబడి ప్రమాదం చోటు చేసుకున్నది. అదృష్టవశాత్తు ఎవరికి గాయాలు కాలేదు. మళ్లీ రోడ్డుపై గుంతలు తవ్వారు. అధికారులు త్వరగా పనులు పూర్తిచేసి రోడ్డును బాగు చేయాలని, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నగరవాసులు కోరుతున్నారు.

రేపు టీయూలో సేవాలాల్ జయంతి ఉత్సవాలు

వివరాలు వెల్లడిస్తున్న గిరిజన శక్తి నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 19: సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఈనెల 21వ తేదీన తెలంగాణ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు గిరిజన శక్తి బాధ్యులు తెలిపారు. యూనివర్సిటీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సింగరేణి కాలరీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాంనాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. ప్రొఫెసర్లు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో గిరిజన శక్తి యూనివర్సిటీ అధ్యక్షుడు శ్రీనూరా ధోడ్, ఎన్ఎస్‌వో అధ్యక్షుడు సాగర్‌నాయక్, లక్ష్మణ్, పృథ్వీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

సిరికొండ, ఫిబ్రవరి 19: మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామశివారులో ఉన్న మామిడి వనంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడిచేశారు. ఈ సందర్భంగా పేకాడుతున్న ఐదుగురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి రూ.7.550నగదుతోపాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్సై రామ్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు శిక్ష

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 19: నగరంలోని రెండో టౌన్ ఏరియాలో ఎస్సై యాసిర్ అరాఫత్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బోసు సాయిలు మద్యం తాగి పట్టుబడ్డాడు. అతడిని బుధవారం ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్సై తెలిపారు. దీంతో అతడిని జిల్లా జైలుకు తరలించామని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

మాట్లాడుతున్న నన్నేసాబ్

కోటగిరి, ఫిబ్రవరి 19: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా అన్యాయం చేశారని కార్మిక నాయకుడు నన్నేసాబ్ మండిపడ్డారు. 'కేంద్ర బడ్జెట్ ఎవరికి ప్రయోజనం..?' అనే అంశంపై ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం కోటగిరిలో సెమినార్ నిర్వహించారు.ఈ సందర్భంగా నన్నేసాబ్ మాట్లాడుతూ.. జిల్లాలో పసుపు బోర్డు, జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం, బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వేలైన్, నిజాంషుగర్ ఫ్యాక్టరీ, పలు అభివృద్ధి పనులకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించనందుకు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు గంగాధరప్పా, నాగ్‌నాథ్, లక్ష్మణ్, లింగమణి, సమత, హన్మాండ్లు, సాయిలు, నాగరాజు, లక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలి

సిరికొండ, ఫిబ్రవరి 19: మండలంలోని తూంపల్లి గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి అభిషేక్ ఆధ్వర్యంలో 42 గేదెలు, 18 ఆవులకు చికిత్స చేశారు. పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్దుల్ మజీద్, సూపర్‌వైజర్ కృష్ణ, వీడీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, బాలకిషన్, దేవయ్య, రైతులు పాల్గొన్నారు.

శేషాద్రి ఫారంలో..

పొతంగల్, ఫిబ్రవరి 19: మండలంలోని శేషాద్రి ఫారంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. దూడలకు నట్టల నివారణ మందు వేశారు. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని పశువైద్యాధికారి సురేశ్ అన్నారు. కార్యక్రమంలో సహాయకులు అభిజిత్, బలరాం, గోపాల మిత్ర సూపర్‌వైజర్ తిరుపతి, గోపాల మిత్రలు సాయిలు, రియాజ్, మైత్రి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

శేషాద్రి ఫారంలో చికిత్స నిర్వహిస్తున్న పశువైద్యుడు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బాల్కొండ, ఫిబ్రవరి 19: రాబోవు ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలోని శాసనమండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లోని మౌలిక వసతులపై మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా, ర్యాంప్, టాయిలెట్స్ తదితర వసతులను కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి ప్రతిభాపాటవాలను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఆయన వెంట ఎస్సై నరేశ్, ఎంఈవో బట్టు రాజేశ్వర్, ఇన్‌చార్జి హెచ్ఎం ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీపీ జి.వెంకటేశ్వర్‌రెడ్డి

విహార యాత్రకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

విహారయాత్రకు వెళ్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 19: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ) విద్యార్థులు బుధవారం విహారయాత్రకు వెళ్లారు. హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం, నెహ్రూ జూలాజికల్ పార్క్, గోల్కొండ కోటను సందర్శించి వాటిలోని ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించేందుకు విహారయాత్రకు వెళ్తున్నట్లు హెచ్ఎం బాలచంద్రం తెలిపారు.

విద్యార్థులతోపాటు హెచ్ఎం, ఉపాధ్యాయులు రామ్మోహన్, వెంకట్, కృష్ణ, స్నేహ, కల్యాణి, జ్యోతి, అఫ్సాన్, అర్షద్, ఖైరాన్,కామేశ్వరి, రాజ్యలక్ష్మి, ప్రసన్న, రాజన్న ఉన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

విద్యార్థిని నుంచి సమాధానాలు రాబడుతున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్ రూరల్, ఫిబ్రవరి 19: మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. సాలూర మండల కేంద్రంలోని ప్రభుత్వ పాథమిక, ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సాలూర తహసీల్దార్ శశిభూషణ్ తదితరులు ఉన్నారు.

రేపు అధికారికంగా సేవాలాల్ జయంతి

మాక్లూర్, ఫిబ్రవరి19: మండలంలోని సట్లాపూర్ తండాలో సేవాలాల్ మహరాజ్ జయంతి శుక్రవారం అధికారికంగా నిర్వహించనున్నట్లు మండల బంజారా సేవా సంఘం అధ్యక్షుడు గణపతినాయక్, మాజీ జడ్పీటీసీ పీర్‌సింగ్‌నాయక్, మాజీ కార్పొరేటర్ రాయిసింగ్‌నాయక్, అంబు నాయక్, దినేశ్‌నాయక్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న కార్యక్రమంలో అధికారులు, బంజరా సేవా సంఘం నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

బోధన్, ఫిబ్రవరి 19: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ సూచించారు. బుధవారం బోధన్ పట్టణం శక్కర్‌నగర్ బస్తీ దవాఖానలో డివిజన్‌లోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయాలని, తల్లీబిడ్డల క్షేమం కోసం ఆరోగ్య సిబ్బంది పనిచేయాలని అన్నారు. గర్భిణులు ఏ సమయంలో ఏమందులు వాడాలో అవగాహన కల్పించాలని అన్నారు. పైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాన్నారు. మార్చి 3వ తేదీ నుంచి స్క్రీనింగ్ టెస్ట్‌లు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



సుద్దులంలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పోచారం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 19: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని బుధవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్ర పటాలకు నివాళులర్పించారు. పలు ప్రాంతాల్లో శివాజీ విగ్రహాలను ఆవిష్కరించారు. యువకులు బైక్ ర్యాలీలు చేపట్టారు.

నేడు భీమ్‌గల్‌కు ఎమ్మెల్యే వేముల రాక

మోర్తాడ్/వేల్పూర్, ఫిబ్రవరి 19: మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం భీమ్‌గల్ మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు భీమ్‌గల్‌లోని బంజారా భవన్‌లో బాల్కొండ నియోజకవర్గ బంజారాలతో కలిసి సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. సాయంత్రం 6గంటలకు లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ కార్యక్రమంలో పాల్గొంటారు.

నర్సరీల్లో షేడ్‌నెట్ ఏర్పాటు చేయాలి

మోర్తాడ్, ఫిబ్రవరి 19: ఎండలు ముదురుతున్న నేపథ్యంలో గ్రామాల్లోని నర్సరీల్లో షేడ్ నెట్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రాజశ్రీ నివాస్ సూచించారు. బుధవారం కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీల్లో నాటిన మొక్కలకు ప్రతిరోజూ నీళ్లు పట్టి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మార్చి నెలాఖరు వరకు గ్రామాల్లో వందశాతం పన్ను వసూలయ్యేలా చూడాలని చెప్పారు. శానిటేషన్ పనులు చేపటాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో సదాశివ్, కార్యదర్శులు శాంతికుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I,Kandadi Rajitha R/o H.No.2-89 ,Yerrapahad (V), Tadwai (M), Kamareddy -Dist. I have changed my name to DEVIREDDY RAJITHA W/o DEVIREDDY RAM MOHAN REDDY(New name) for all future purposes NTZ-33449

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలనకు రెండు బృందాల ఏర్పాటు

రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

బాల్కొండ, ఫిబ్రవరి 19: పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన కోసం మండల విద్యాశాఖ మండలంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ జడ్పీహెచ్ఎస్, కిసాన్‌నగర్ పాఠశాలలను ఎంఈవో, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, సబ్జెక్టు నిపుణులు ప్రశాంత్‌కుమార్, శ్రీనివాస్ తదితరులతో కలిసి పరిశీలించామన్నారు. మరో టీమ్ కిసాన్‌నగర్ కాంప్లెక్స్ హెచ్ఎం రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను పరిశీలిస్తాయన్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఫలితాలు గ్రేడింగ్ పద్ధతిలో కాకుండా మార్కుల రూపంలో ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

మోర్తాడ్, ఫిబ్రవరి 19: ప్రతి తరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం చౌట్‌పల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీచేశారు. ఈసందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈవో అశోక్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి19: విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని, రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో అశోక్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం, పాఠశాల వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని శ్రమించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెంజల్‌లో..

రెంజల్, ఫిబ్రవరి 19: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల వార్షికోత్సవం, టెన్త్ విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ పదోతగతి పరీక్షలు దగ్గర పడుతుండడంతో ఇష్టంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ఆర్మూర్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రెంజల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు